# గౌరమ్మ!

## పి. చంద్రశేఖర ఆజాద్

### మెయిన్ గేట్ తలుపులు తెరిచేవున్నాయి

ఆ ఇంటికి చెంది మొత్తం రెండు పోర్షన్‌లు. వెనకాల రెండు గదుల్లో 'మూర్తి' వాళ్ళ కుటుంబం వుంటోంది. వాళ్ళకి పిల్లలు లేకపోవడంతో వాటితోనే సరిపెట్టుకుంటున్నారు. పెద్ద బెడ్ రూమ్. దానికి ఎటాచ్‌డ్ బాత్‌రూమ్. కిచెన్ రూమ్ నుండే ఎంట్రన్స్. బయట కొబ్బరి చెట్లు. వాతావరణం చాలా ఆహ్లాదకరంగా వుంటుంది.



సాధారణంగా వెనక్కి ఎవరూ రారు. ముందు పోర్షన్‌లో వుంటున్న వారితో సంబంధాలు బాగుండకపోవడంతో ఎవరి ప్రపంచంలో వారు బతుకుతున్నారా అనిపిస్తుంటుంది.

అదేదో లోకంలో విహరిస్తూ అడుగులో అడుగువేస్తున్న గౌరి ఆగిపోయింది. గదిలో నుండి మాటలు వినిపిస్తున్నాయి.

"అమ్మగారు వచ్చేసిందా" అనుకొంది.

తనకు తెలియకుండానే రెండు చేతులూ గుండెల మీదకు చేరిపోయాయి.

వెళ్లే ముందు ఒకటికి రెండు సార్లు చెప్పి వెళ్లింది.

"గౌరీ నేను రెండు వారాల దాకా రాను. అయ్యగారు ఇంట్లోనే వండుకుంటారు. అంట్లు తోమేసి వెళ్లు. అంతేకాదు. నేను లేనని నిర్లక్ష్యం చేయొద్దు. గదులు వూడ్చి పట్టాతో తుడువు. నేను వచ్చేసరికి ఇల్లు అద్దంలా వుండాలి. ఏదో టైమ్‌లో ఈ పనులు చెయ్యి". అనటమే కాకుండా చేతిలో ఓ ఇరవై రూపాయలు పెట్టింది.

అలా నిలబడి చెవులు రిక్కించింది.

అది అమ్మగారి గొంతు కాదు. అసలు ఆడగొంతే కాదు.

అన్నీ మగగొంతులు.

అప్పుడప్పుడూ నవ్వులు వినిపిస్తున్నాయి.

గౌరి అలానే నిలబడి ఆ మాటలు వింటోంది.

పది నిమిషాలు ...

గౌరి ముఖంలో రంగులు మారిపోతున్నాయి. దుఃఖం విరుచుకుపడుతుందా అనిపించింది. గిరుక్కున వెనక్కి తిరిగింది.

వడివడిగా నడుచుకుంటూ తన గుడిసె దగ్గరికి వెళ్లింది. అమాంతం మంచం మీద విరుచుకు పడినట్లే కూలబడిపోయింది. ఎవరో వికృతంగా నవ్వుతున్నట్లనిపించింది.

రెండు చేతుల్లో ముఖం దాచుకొని ఏడుస్తోంది. అలా ఏడుస్తుంటే జరిగిపోయినకాలమంతా కళ్ల ముందు కదులుతున్నట్లుంది.

** ** **

"అయ్యగారు లేవరు. నీకెందుకు నువ్వా గది వూడ్చేయ్" అంది వసుంధర చీవురుపట్టుకొని ఫ్యాన్ కట్టేసి గది చిమ్ముతుంటే ఎందుకో అనుమానం. మెల్లగా తలెత్తి చూస్తే తనకేసి 'ఆబగా' చూస్తున్న అయ్యగారు. కంగారు పడిపోయింది.

చిరునవ్వు నవ్వి కళ్లు మూసుకున్నాడు. ఎందుకో శరీరమంతా జల్లుమంటూనే వుంది. చీపురుతో వూడుస్తున్నా, తడిగుడ్డతో గదంతా తుడుస్తున్నా శరీరం నిండా కొన్ని వందల కళ్లు ఏర్పాటు చేసుకొని తననే చూస్తున్నట్టు అనిపించేది.

అసలా మనిషి చూపులోనే ఏదో వింత ఆకర్షణ వుంది. అది ఆకర్షణ కూడా కాదేమో. మనిషిని తినేసేట్టు చూస్తాడు. ఆ గదిలో టేబుల్ మీద

రకరకాల డబ్బాలు కనిపిస్తుంటాయి. అక్కడకి వెళ్తే చాలు అదోరకమైన వాసన. చీపురు అవతల పారేసి అక్కడే వుండిపోవాలనిపిస్తుంటుంది. స్నానాల గది లోనూ అంతే నీళ్లు పెట్టటానికి వెళ్లినపుడు ఏం వాసనో ...! ఆ సబ్బుల పేరేమిటో తెలియదు. అసలా రంగులే చాలా బాగుంటాయి.

స్నానం చేసి వచ్చి అద్దం ముందు నిలబడతాడు. ఫ్యాన్ మెల్లగా తిరుగుతుంటుంది. అప్పుడు వస్తుంది. అబ్బ ... ఎంత మంచి వాసనో ... మల్లెపూల గుట్టల మీదనుండి వచ్చే గాలి వాసన. రెండు మూడుసార్లు పాము బుసలు వినిపించినట్లు శబ్దం వస్తే అనుమానంగా తొంగి చూసింది. చేతిలో సన్నగా అదేదో డబ్బా. అందులో నుండే శబ్దం మొగలిపువ్వూ, సంపెంగ పువ్వు వాసనల్ని కలిపితే వచ్చే సువాసన. ముక్కులు అదిరిపోతాయి. ఒక్కోసారి తల తిరిగినట్లనిపిస్తుంది.

బట్టలు వేసుకుంటున్నప్పుడు చూడాలి. ఎంత బాగుంటుందో. అంత అయిపోయాక నల్ల కళ్లద్దాలు అందుకుంటాడు. వాటిని పెట్టుకుని 'వసుంధర' దగ్గరికొస్తాడు. పాపం 'అమ్మగారు' అప్పటికి స్నానం కూడా చెయ్యరు. వంటింట్లోనే డైనింగ్ టేబుల్. ముందు టిఫిన్ పెట్టి కాఫీ ఇస్తుంది. స్కూటర్ తాళం చెవులందుకొని ఆయన వెళ్లిపోవటంతో గదిలో వస్తువులన్నీ పోయినట్లు ... బోసిగా వుంటుంది.

చాలా విచిత్రమైన 'మనిషి', 'వసుంధర' పక్కనే వున్నా గుచ్చి గుచ్చి చూస్తాడు. సిగ్గుతో, అదోరకమైన భయంతో ముడుచుకుపోవటమే.

మొదటిసారి బాత్‌రూమ్‌లో నీళ్లు పెట్టి వెనక్కి తిరిగింది. అప్పటికే వచ్చాడేమో చూసుకోక అతని మీద పడిపోయింది. టర్కీ టవల్ మాత్రం చుట్టుకున్నాడు. తనకు తెలియకుండానే శరీరం అతని మీద వాలిపోయింది. తన గుండెలు అతని వక్ష స్థలాన్ని తాకాయి. అతనిరెండు చేతులూ వీపు వెనకాల పడినప్పుడు కాలిన పెనం మీద నీళ్లు చల్లినప్పటి స్థితి. తనను కావాలనే శరీరానికి నొక్కుకున్నాడా ....

ఇప్పటికీ తలుచుకుంటే శరీరం జల్లుమంటుంది. పెళ్లయి రెండు సంవత్సరాలు కావస్తున్నా 'కోటేసు' మావ శరీరం నుండి అలాంటి వాసన రాలేదు. ఎప్పుడూ చెమట వాసన. ఇంకేదో వాసన.

అప్పటినుండి ఇంకేదో ఆకర్షణ. 'అమ్మ'గారికి మాత్రం తనంటే ప్రేమ. ఎప్పుడూ ఆలోచిస్తుంటుంది. పిల్లలు పుట్టలేదనే బాధ కాబోలు. ఏ మాత్రం తీరి కదొరికినా రమ్మంటుంది. తలలో పేలున్నాయేమో చూడమంటుంది. 'నీకింకా పిల్లలు పుట్టలేదెందుకే. డాక్టర్‌కి చూపించుకోరాదా' అంటుంది. ఇంట్లో మిగిలిన అన్నం, కూరలు ఇస్తుంది. వారంలో నాలుగు రోజులు ఉపవాసం వుంటుంది. పూజలు చేస్తుంది.

## ● పేద మనుషులకు కోరికలే తప్ప మనసుండదా?

ఆ కొబ్బరి చెట్లని చూసుకుంటూ తిరుగుతుం టుంది. మొన్నటికి మొన్న పిలిచి చెప్పింది.

"బాగా బోర్‌గా వుందే గౌరీ. మా పుట్టింటికి వెళ్తున్నా" అని .

ఆమె చెప్పినట్లే ఉదయం వస్తే "అయ్యగారు" ఇంకా లేవలేదు. ఇంకా నిద్రపోతుంటే ఆఫీస్‌కి ఆల స్యమవుతుందే అనిపించింది. తలుపు కొట్టింది. రెండు నిముషాల తర్వాత వచ్చి తలుపు తీశాడు.

'గౌరీ'ని చూడగానే పెదవులు విచ్చుకున్నాయి.

'రా' అని లోపలికి వెళ్లాడు. బ్రష్ తీసుకొని బాత్‌రూమ్‌లోకి వెళ్లాడు. గౌరి చీపురు అందు కొంది.

'కొంచెం నీళ్లు తెచ్చిపెడతావా' అన్నాడు.

పైపు బయట వుంటుంది. అందులో మంచి నీళ్లు వస్తాయి. మామూలు అవసరాలకి మోటర్‌తో వచ్చే గ్రౌండ్ వాటర్. నీళ్లు పట్టి తీసుకొచ్చింది. ముఖం కడిగి స్టవ్ వెలిగించాడు.

కాఫీ తయారు చేసి రెండు కప్పుల్లో పోసి 'గౌరీ' అని పిల్చాడు.

"ఏంటయ్యగోరూ" అంటూ వెళ్లింది.

"కాఫీ తాగు" అన్నాడు.

"నాకా ... నేనా" అంటూ తడబడింది.

"అమ్మగారిస్తే తాగవా. తాగు. అమ్మగారు చేసి నంత బాగా వున్నాదో లేదో చెప్పు"

సిగ్గుగా కప్పు అందుకొని వెనక్కి తిరిగింది. కప్పు నోటికి తాకగానే తిరిగి శరీరం జల్లుమంది. 'అమ్మ' గారు 'కాఫీ' ఇవ్వరు. 'టీ' మాత్రమే ఇస్తారు. వేడివేడిగా గొంతులోకి బాగానే వుంటాయి గాని ఇది మాత్రం అమృతంలా వుంది.

"ఎలా వుంది ?"

ఉలిక్కిపడటంతో కాఫీ కప్పులో నుండి వొలికి బట్టల మీద పడింది. 'అరెరే' అంటూ దగ్గరకొచ్చి చేత్తో ఆ మరకలు తుడిచాడు. రక్తం సలసల కాగుతోంది.

"ఏమిటి ఇంత వేడి... జ్వరం వచ్చిందా" అన్నాడు.

అడ్డంగా తలూపుతోంది.

చెయ్యి పట్టుకుని గదిలోకి నడిపించుకొచ్చాడు.



**రెండులక్షల కోటు**

రాజా హిందుస్తానీ చిత్రం దర్శకుడు 'ధడ్ కన్' సినిమా తీస్తున్నాడు. అందులో హీరోయిన్ శిల్పాశెట్టి జంతువుల చర్మంతో చేసిన కోటు వేసుకోవాల్సి వుంది. అది ఎంతో ఖరీ దైంది. అయినా ఆ కోటు ఖరీదు చెల్లించాడు నిర్మాత. ఎంతంటే అక్షరాలా రెండులక్షల రూపా యలు. శిల్పాలాంటి గర్ల్ ఫ్రెండ్ ముందు పీనాసి బుద్ధితో ప్రవర్తించడం బాగోదని అలా చేశాడని ఓ కథనం.


**ఉత్తర భారత యాత్రలు**

| | | Frequency | Fare Rs. |
|---|---|---|---|
| 1. | Delhi - Shimla - Kulu - Manali - Chandigarh - Delhi | Every Friday | 2,000/- |
| 2. | Delhi - Agra - Jaipur - Delhi (Golden Triangle Tour) | Mon/Wed/Fri (Non-AC) (AC) | 600/- 800/- |
| 3. | Delhi - Jaipur - Ajmer - Pushkar - Fatehpur Sikri-Agra - Mathura - Brindavan - Delhi | Every Monday (Non-AC) (AC) | 800/- 1,000/- |
| 4. | Delhi - Mussorie - Haridwar - Rishikesh - Delhi | Tue/Fri | 500/- |

Fare includes Dormitory accommodation, transport and guide services. We are running, approved LTC tours for Central Government employees. All tours are by *Super Deluxe buses, starting from our New Delhi office.* LUCKY WINNERS TRAVELLING IN OUR BUSES WILL RECEIVE PRIZES AND MADRAS - SINGAPORE - MADRAS AIR TICKET. Contact our offices at Bangalore Ph : 2262633, Madras Ph : 564864, Vijayawada Ph : 672227 Visakhapatnam Ph : 545565, Bombay Ph. 2624560 for advance reservations. మీరు ఢిల్లీ వచ్చినపుడు ఆధునాతన సౌకర్యములతో నిర్మింపబడిన 100 రూములు గల "హోటల్ సదరన్" లో బస చేయండి. ఢిల్లీలో రుచికరమైన గోంగూర, ఆవకాయ పచ్చళ్ళతో తెలుగు భోజనం మా హోటల్లోని అమరావతి / సుప్రభాత్ రెస్టారెంట్లలో లభించును.

**HOTEL SOUTHERN/SOUTHERN TRAVELS (P) LTD.**

(Recognised by Department of Tourism Govt. of India)

ఢిల్లీలోని తెలుగు వారి ప్రముఖ వాణిజ్య సంస్థ

| | |
|---|---|
| 18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi - 5, Phones : 5782932, 5739508 Fax : 011-5751308, | Hotel Ayodhya Building, Lakdi-ka-pul, Hyderabad - 500 004. Phones : 227233, 223658. |

SUVARNA

మంచం మీద కూర్చోబెట్టాడు.

"తల నొప్పిగా వుందా? టాబ్లెట్ ఇస్తా"

గౌరి అడ్డంగా తలూపింది.

"ముందు వెళ్లి బాత్‌రూమ్‌లో సబ్బుతో ముఖం కడుక్కో. స్నానం చేస్తావా?" గౌరీకేం అర్థం కావటం లేదు.

"ఓ! చీర లేదు కదూ. అమ్మగారి చీర కట్టుకుంటావా?"

గౌరికి 'అయ్యగారు' ఏమంటున్నాడో అర్థం కావడం లేదు.

తనకి ఏదో చెప్పాలనిపిస్తోంది. అశక్తతతో మాటలు రావటం లేదు.

"ఏమిటి మాటలు రావా?"

వచ్చునన్నట్లు తలూపింది.

"మరి ముఖం కడుక్కోమని చెప్పాగా"

గౌరి మెల్లగా బాత్‌రూమ్‌లోకి నడిచింది. సబ్బు మీద చెయ్యి వెయ్యటానికి ధైర్యం చాలటం లేదు. ముందు చల్లటి నీళ్లతో ముఖం కడుక్కోవాలి. నీళ్లు అందుకొని ముఖం తడిపేసరికి ఈ లోకంలో పడింది.

"ఎందుకంత భయపడుతున్నావ్ నేను రాక్షసుడ్నా" అన్నాడు మూర్తి.

తల అడ్డంగా వూపింది.

నవ్వుతూ దగ్గర కొచ్చాడు. రెండు చేతులూ భుజాల మీద వేసి కళ్లలోకి సూటిగా చూశాడు.

"నువ్వు ఎంత బాగుంటావో" అన్నాడు నవ్వుతూనే.

"అసలు నాకు నీలాంటి వాళ్లంటే ఇష్టం. కొంచెం నలుపయితే ఏమిటి? నీకున్న బిగువు ఎవరి దగ్గరుంది. మంచి చీర కట్టి, తలలో వూలు పెట్టుకుంటే నీ ముందు సిన్మా స్టార్స్ పనికొస్తారా"

గౌరి అయ్యగారినే చూస్తోంది.

"బాత్‌రూమ్‌లో నా మీద పడినప్పటి నుంచి నా మనసు మనసులో లేదు. ఒక్కసారి ... ప్లీజ్ ..."

"వద్దు ... వద్దు" అనాలనుకొంది.

మూర్తి గిరుక్కున వెనక్కి వెళ్లి తలుపు మూశాడు. గౌరిని అద్దం ముందుకి తీసుకొచ్చాడు. బాటిల్లో స్ప్రే ఆమె మీద చల్లాడు. అమాంతం రెండు చేతుల్తో గాల్లోకి లేపాడు.

మెత్తటి పరుపుల మీద శరీరం వాలింది. ఏం జరుగుతుందో అర్థం కావటం లేదు. మత్తుమందు జల్లిన భావన.

"థ్యాంక్యు" అన్నాడు చెవిలో.

బాత్‌రూమ్‌లోకి వెళ్లి స్నానం చేశాడు.

"సాయంకాలం వస్తావా ...వచ్చేటప్పుడు పలావ్ తెస్తాను ఇద్దరం తిందాం. ఓ గంట వుండి పోదువుగాని"

ఇంటికి వచ్చి స్నానం చేసింది. ఎంత రుద్దినా అదే వాసన. గౌరికి ఎంత గర్వంగానో అనిపించింది. ఇదేదో సరికొత్త అనుభవంలా వుంది. 'అయ్యగారూ' 'మెత్తటిపరుపూ' మరీ మరీ




గుర్తొస్తున్నాయి.

సాయంకాలం అయ్యేసరికి తనకు తెలియకుండా అడుగులు ఆ ఇంటికి నడిపించాయి.

"వచ్చావా" అంటూ నవ్వాడు.

మంచంమీద కూర్చోబెట్టాడు.

"గౌరీ నువ్వు బాగా నచ్చావ్. అసలు నీ ముందు మీ అమ్మగారు దిగదుడుపు. అది ఎందుకు పనికొస్తుంది చెప్పు" అన్నాడు.

"ఇది అమ్మగారికి తెలిస్తే ..." అంది

"ఎందుకు తెలుస్తుంది. తెలియాల్సిన అవసరం ఏముంది. నిజంగా చెబుతున్నా నా పెళ్లాం మెడలో బంగారం నగలున్నాయి. తోలు కొంచెం ఎర్రగా వుంది. ఖరీదైన చీరలు కడుతుంది. ఏదో గెడకర్రకి చీర చుట్టినట్లు. ఆడదంటే ఎలా వుండాలి. నీలా. అందుకే నీకు మంచి చీర కొనిపెడతా. రేపు అది కట్టుకుని నువ్వు రావాలి" అన్నాడు.

"అంతేకాదు. ఈ హైక్లాస్ సొసైటీ ఆడవాళ్లున్నారే బొత్తిగా దేనికీ పనికిరారు. నీలాంటి వాళ్ల కాళ్లగోటికి సరిపోరు. మీదంతా నాచురల్ బ్యూటీ. అందుకే మగవాడు భార్యల్ని భరించలేక పారిపోతుంటాడు."

ఆ మాటలన్నీ పూర్తిగా అర్థం కాకపోయినా ఎందుకో తన మీద తనకు బోల్డంత ప్రేమ పుట్టింది. ఆ సాయంకాలం మెత్తటి కోడి ముక్కలు రుచి చూసింది. అద్దం ముందు కళ్లజోడు పెట్టుకొని చూసుకొంది. తన పక్కన అయ్యగారు సిన్మాలో 'హీరో'లాగా నిలబడ్డాడు.

ఇంటికి వెళ్ళింది. ఎందుకో మళ్ళీ మళ్ళీ స్నానం చేయాలనిపించింది. మంచంమీద పడుకుంటే కలలు. అందులో 'అయ్యగారు' స్కూటర్ వెనకాల కూర్చోబెట్టుకున్నారు. అమ్మగారు అడ్డంవస్తే అవతలకి నెట్టేశారు. మెలకువ వచ్చేటప్పటికి తన మీద బరువుగా 'మావ'. నెట్టేయాలనుకుంది. 'ఛీ... లే' అని అరిచింది. నవ్వుతాడు.

నులకమంచం శరీరాన్ని కోస్తున్నంత బాధ.

"లే... సుచీ షుబ్రం లేదు. నీళ్లు పోసుకొచ్చావా" అంటోంది. 'మావ' అవేం వినేట్లు లేడు. ఎందుకో 'మావ' స్థానంలో 'అయ్య'గారిని ఊహించుకొంది. తన్మయత్వంలో కళ్లు మూసుకొంది.

'ఏపి బువ్వెట్టవా' అంటున్నాడు.

'పట్టుకుని తిను' కసిర్చింది.

గబగబ లేచిపోయి తాటాకు దొడ్లో నీళ్లు గుమ్మరించుకుంది. 'కోటేసు' మావకి అంతా వింతగా వుంది. 'ఏటో గౌరమ్మకి గాలి సోకిందా' అనుకున్నాడు. ఆ రెండు రోజులూ 'మావ'ని పురుగుని చూసినట్టు చూసింది.

అయ్యగారిచ్చిన కొత్త చీర కట్టుకుని వస్తున్నప్పుడు గదిలోపలి మాటలు మళ్లీ మళ్లీ గుర్తొస్తున్నాయి.

"నేను చెప్పేది నోట్ చేసుకోండి. జీవితానందానికి భార్యలు అడ్డు" అంటూ ఆరంభించాడు మూర్తి.

"పెళ్లయిన ప్రతి మగవాడూ సంవత్సరానికి కనీసం నెలరోజులన్నా భార్యని పుట్టింటికి పంపించని పక్షంలో జీవితం పట్ల ఆశ చచ్చిపోతుంది. మనం ప్రయోగాలు చేయాలంటే వాళ్లు సహకరించరు."

'ఏం ప్రయోగాలవి?' అన్నారెవరో.

"సెక్స్‌లో, కార్స్‌లో, కాక్‌టెయిల్ పార్టీల్లో – మంచి ఫుడ్ విషయంలో ఇంకా అనేక రంగాలున్నాయి. ఇప్పుడు మీలో ఎవరికన్నా 'పనిమనుషుల్తో శృంగారం' అనే అనుభవం వుందా?" అనడిగాడు.

"అయ్యా నువ్వంటే కృష్ణమూర్తివి. నీ జీవితానందానికి భార్య ఎప్పుడూ అడ్డని మేమనుకోవడం లేదు. అయినా 'పనిమనిషి'తో కూడానా? అందులోనూ ఎంగిలాకులు ఎత్తుకుంటారనుకుంటా".

"ఏం వాళ్లు మనుషులు కాదా?"

"ఎందుకు కారు. కానీ కొన్ని యుగాలుగా స్నానం చెయ్యరు. ఆ కంపుని ఎవరు భరిస్తారు. ఇంత చీప్ టేస్టేమిటి. ఛా..."

అందరూ పెళ్ళున నవ్వారు.

మూర్తి భయంకరమైన 'వుమనైజర్' అనే విషయం అక్కడ అందరికీ తెలుసు – ఒక్క అతని భార్యకి తప్పించి. ఆఫీసులో ఖాళీ సమయాల్లో తన శృంగార అనుభవాల గురించి చెబుతుంటాడు. కొంతమంది అడిగి చెప్పించుకుంటారు. ఇంకొంతమంది ఇష్టం లేనట్టు ముఖం పెట్టి వింటుంటారు.

"మనదంతా ఫ్రీ అండ్ ఫ్రాంక్. నేను 'ప్రీచ్' చేయను. నా అభిప్రాయాలు చెబుతా. ఈ ప్రపంచంలో చాలామంది కోర్కెల్ని దాచుకుంటారు. మానసిక వ్యభిచారం చేస్తారు. కోర్కెల్ని అణుచుకుంటారు. వాటికి ఆదర్శం అని పేరు పెడతారు. ఫ్రాయిడ్ నుండి నేటి సెక్స్ ప్రశ్నలకు సమాధానాలిచ్చే డాక్టర్ల దాకా చదివిన అనుభవంతో చెబుతున్నా.

మానసిక వ్యభిచారి కాని ఆడా, మగా ఒక్కరూ వుండరు".

"ప్రీచ్ చేయను అని చెప్పి ఈ సిద్ధాంతాలొద్దు. నీ థీరీ మాకు తెలుసు. ఆడది అయితే చాలు నీకు. నీలాంటి వారివల్లనే ప్రపంచం మీదకి ఎయిడ్స్ వచ్చింది."

"అదే పొరపాటు. అందుకే నేను గౌరమ్మలను చూసుకోవటం. చాలా ఫ్రెష్‌గా వుంటారు. గబ్బుంటావా... రెండు సబ్బులు ఖర్చు. ఓ అరబాటిల్ స్ప్రేచేస్తాం. ముఖం బాగుండకపోతే చీర కొంగేస్తాం. అందులోనూ మనలాంటి వాళ్లు రమ్మని అడిగితే ఇంక చూడు... వాళ్ల దృష్టిలో మనం ఓ 'చిరు' లాంటి వాళ్లం. జస్ట్ ఓ చీర, రవికె, పలావ్‌లో ఓ రెండు ముక్కల్తో పనయిపోతుంది. అయినా. సెక్స్ అనేది దివ్యమైనది. అందులో వివక్ష వుండ రాదు. ఆ సమయంలో పందయినా అందంగా వుంటుంది."

"నువ్వు డబ్బు కూడా ఇస్తావా. వాళ్లు బొడ్డు దగ్గర దాచుకున్నాటని కాజేసే రకానివి" అన్నార వరో.

అందరూ పెళ్ళున నవ్వారు.

"నువ్వు లక్ష చెప్పు ఇది చాలా నీచమైన పని. అయినా సెక్స్‌ని అంత భయంకరంగా చర్చించాలా. మీ మాటలు వింటుంటే జీవితం మీదే విరక్తి పుడుతుంది" అన్నాడు రమణ.

"ఆ సంగతి అటుంచితే 'మూర్తి' గారి విల్‌పవర్‌ని మెచ్చుకోవాలి. ఇంతకూ వీళ్ల డ్రీమ్‌గర్ల్‌ని ఎన్ని సబ్బుల్తో తోమినా ఆ గబ్బు పోదని నేను స్టాంపు పేపర్ మీద రాసిస్తా. సెక్స్ విషయంలో కేవలం భార్యకే పరిమితం కావాలి అని నేను అనుకోను గాని మరీ అలాంటివారి దగ్గర కంటే అబ్బే యాక్".

"సర్. మూర్తిగారి కళ్లలో చూడు. ఈయన చిరు. గౌరమ్మ తాజా హీరోయిన్."

ఒక్కొక్క' మాట గౌరిని నిలువునా కంపింపజేస్తునవాయి. ఎంతెంత మాటలంటున్నారు. కంపా? ఈ కంపుకోసమేగా అన్ని మాటలు. ఆడదానికోసం ఈ పెద్దవాళ్లు ఎంతకైనా తెగిస్తారన్నమాట. అయినా ఆయన మాటలు తను ఎలా నమ్మింది?

తన గుడిసన్నా, మంచమన్నా, మావన్నా అసహ్యం కలిగిందే. 'అమ్మగార్ని' అన్ని మాటలు అన్నాడు. తననయితే వాడుకున్నాడు గానీ, అంతకంటే ఏం చేస్తాడు" ఓ రవికె గుడ్డ... ఓ కోక...

ఓ కోడిముక్క... అంతకుమించి మనువాడలేదు కదా. ఈ విషయాలు ఎందుకు గుర్తు రాలేదు.

ఆ అద్దాలు, సబ్బులు, పాము బుసల డబ్బాలు, పరువులు. ఇవన్నీ మోసం చేశాయి. ఇంతకూ 'అమ్మగారు' ఏం పాపం చేసింది. అప్పుడు నవ్వొచ్చింది గౌరికి.

వాళ్లంతా తన కాలిగోటికి చాలరన్నాడు. 'అమ్మగారిని' తనతో పోల్చి. తనకంటే హీనం అన్నాడు. ఈ విషయాలన్నీ తెలిస్తే ఏమనుకుంటుంది? ఆమె ఎంత దురదృష్టవంతురాలు. ఈ పెద్ద కుటుంబాల ఆడవాళ్లు ఒక్కసారి కళ్లు తెరుచుకు చూడాలి. అందరూ మొగుళ్లని తన్ని తగిలేస్తారా? పుట్టింటికి పారిపోతారా... లేక ఏదన్నా మింగి ఛస్తారా?

జరిగిందేదో జరిగిపోయింది. రెండు రోజులుగా 'మావ' కంగారుపడిపోతున్నాడు. తనంటే ఎంత పిచ్చి ప్రేమ! అదిసరే. 'మావ' కూడా అలాంటివాడేనా. ఏమో. ఎందుకు కాకూడదు. 'మావ' కూడా ఇలానే రోడ్డు మీద కాగితాలేరుకునే వాళ్ళతో మాట్లాడతాడా... వల్లోవేసుకుంటాడా... ఎందుకు వేసుకోడు. ఎంతమంది రిక్షావాళ్లని చూడలేదు. గుడిసెల్లో జరిగేయి గుడిసెల్లో, మేడల్లో, డాబాల్లో ఎక్కడపడితే అక్కడ... మొగాళ్లూ.. ఆడాళ్లూ కూడా... గౌరి ఆలోచనలు రకరకాలుగా సాగుతున్నాయి.

జరిగిన దానికంటే, తనని మోసం చేసిన విధానమే కడుపు రగిలేలా చేస్తోంది. దీనికి బదులు చెప్పాలి. కక్ష తీర్చుకోవాలి. కనీసం ఎదురుగా నిలబడి చెడామడా తిట్టిపోయాలి. అప్పటిదాకా తనకు శాంతి వుండదు.

ఇంకా మంచంలో వుండాలనిపించలేదు. లేచి స్నానం చేసింది. సరిగ్గా అప్పుడే 'మావ' హుషారుగా వచ్చాడు. ఏదో అని అనుమానంగా చూశాడు. గౌరి తలూపింది. తర్వాత పది నిముషాలకి 'మావ' రిక్షా తొక్కుతుంటే వెనకాల కూర్చుంది. ఆ క్షణం అయ్యగారు గానీ, స్కూటర్ గానీ గుర్తే రాలేదు.

** ** **

ఆదివారం ఉదయం

మిత్రులందరూ చేరిపోయారు. పేకముక్కలూ, వాటర్ బాటిల్సూ... ఓ పక్కన చేర్చారు. సాయంకాలం దాకా లేచి పనిలేదు. మధ్యలో ఒకరిద్దరు వెళ్లి క్యారియర్లు తెస్తారు. సిగరెట్లు వెలిగించారు. మాటలు జోరుగా సాగిపోతున్నాయి.

"నిన్న సాయంకాలం మూర్తిగారి డ్రీమ్‌గర్ల్‌ని చూశాను" అన్నాడొకరు.

"అక్కడ?"

"రైల్వే స్టేషన్ ముందునుండి పోతోంది. రిక్షాలో వెనక్కి వాలింది. కాళ్ల దగ్గర్లో బుట్ట వుంది. మరి ఏ పనికి పోతున్నారో".

కిసుక్కున నవ్వారెవరో.

"అదిగో అలా అనకు మూర్తి హర్టవుతాడు."

"నేనేమన్నాను. రిక్షాలో ఒహటే పాటలు... అబ్బో ఆ సొగసు గురించి ఏం చెప్పనులే..." అంటుండగా.

"సైలెన్స్... సైలెన్స్" అన్నారు.

నాకిట్లో గౌరి ముఖం కనిపించింది.

"మూర్తీ... నీ డ్రీమ్‌గర్ల్..." అంటున్నారెవరో.

"గురుడు అపాయింట్‌మెంట్ యిచ్చినట్లు



బ'డే

మనీషా కోయిరాలా వంటి నటీమణి పుట్టిన రోజంటే చాలా హంగామా జరుగుతుందనుకునేరు. కానీ, అందరు ఫ్రెండ్స్‌ను వదిలేసి ఆమె ఎంచక్కా గోవాకు చెక్కేసిందట. గోవా బీచ్‌ల్లో హాయిగా పుట్టినరోజు జరుపుకుంది. ఒక్కతే కాదు సుమండీ కొత్త బోయ్‌ఫ్రెండ్ హుస్సేన్‌తో కలిసి.


మీ శిరోజాలకు

దుమ్మూ ధూళితో పాటు

కెమికల్ షాంపూలా ?

ఇక అవసరం లేదు.




ఎలా ?

సహజ వనమూలికల

సద్గుణ సమ్మేళనం - ధరణి

మీ శిరోజాలకు కాంతిని,

తలకు చల్లదనాన్ని అందిస్తుంది.

ఎందుకంటే దీనిలో వుంది శ్రేష్టమైన

సపిండస్ ట్రిఫోలియాటిస్.

ధరణి

• హెర్బల్ పౌడర్ • ఆర్గానిక్ పౌడర్

Mktg. Office : Dharani Forestry & Orchards Limited.

Hyderabad - 500 014. A.P. Ph: 040-7534121 Fax : 040-7530693

PROGRES

First Time in India FARM TO HOME Eco-Friendly Herbal Powder

న్నాడు. ఇక్కడ మనం ఎందుకు?" అన్నారెవరో మెల్లగా.

మూర్తి నవ్వుతూ లేచి వచ్చాడు.

"ఏంటి గౌరీ".

చేతిలో పొట్లం వుంది. అది అందించింది.

"ఏమిటిది?"

"జిలేబులూ, జాంగ్రీలూ..."

"ఓ! ఇప్పడివన్నీ ఎందుకు. ఫ్రెండ్స్ వచ్చారు. సాయంకాలం వచ్చి ఇల్లంతా శుభ్రం చేసి వెళ్దువు గాని. సరేనా" కన్నుగీటాడు.

తలూపింది గౌరి.

పొట్లాం వాళ్ల ముందు పెట్టాడు.

"ఇదేంట్రో ప్రేమ కానుకా".

"అవును. జిలేబీలూ, జాంగ్రీలూ."

"నేను చెప్తలా. విప్పండి" అన్నారు.

పొట్లాం విప్పితే అన్నీ ముక్కలు...

"ఇదేంట్రా బాబూ... అన్నీ ముక్కలు"

"ఏ చిన్న షాపులోనో కొనుంటుంది. అయినా 'ప్రేమ' ముఖ్యం. బాగానే వుంటాయి. తినండి" అన్నాడు మూర్తి ఓ ముక్క అందుకుంటూ.

తలోముక్క అందుకుని, ముఖం చిట్లిస్తూనే నోట్లో పెట్టుకున్నానరు.

ఇంతలో 'బాబుగారూ' అని వినిపించింది.

మూర్తి గబగబ బయటికొచ్చాడు.

అతనికి మాత్రమే వినిపించేటట్లు అంది.

"అయ్యగారూ... మావు కంపుకొట్టేది నిజవే నండి. మా దగ్గర సొబ్బులుండవు. పవుడేరు లుండవు. ఇంకా సెంట్లో బొంట్లో వుండవు. కానయ్యా మీరు వాసనలొచ్చిపోతారు. అంతా బానే వుందిగాని దేవతలాంటి అమ్మగారి లాంటోల్లని కంపు సేసియకండి. ఇలాగ జరిగిపోతందని తెలిస్తే ఆల్లు కూడా కంపు మొగోల్లని పక్కలో ఏసుకు తొంగుంతారు. మీరు పీకేది లేదు. గుండెలు పగిలిపోవటమే."

మూర్తి కళ్లు ఆగ్రహంతో ఎరుపెక్కుతున్నాయి.

అప్పుడు పెద్దగా అంది.

"రేత్రి గుడికాడ అన్నదానం చేసేరు. యిస్తా రాకులో మిగిలిపోయిన జిలేబులూ, జాంగ్రీలు ఏరి పక్కనెట్టా. ఎంగిలంటినయి సుబ్రంగా తుడి చేసినాను గాని. బాగుండాయా... బాగానే వుంటాయిలె. అయినా ఎంగిలి బతుకులూ, ఎంగిలి మెతుకులూ మీకు కొత్త కాదుకదా... చాలకపోతే సెప్పండి. గుడిసెలో ఇంకాసినున్నాయి. తెస్తా..." అనేసి వెనక్కి తిరిగింది.

భళుక్కుమన్న శబ్దం. ఎవరో వాంతి చేసుకు న్నారు. అది ఎదుటివాడి ముఖంమీద... గుడ్డల మీద... ఆ కంపుకి ఇంకొకరు... క్షణాల్లో గదంతా కంపు... కంపు...

గౌరి గుడిసెకేసి నడుస్తోంది – కళ్లు మెరుస్తుం డగా.

# సిరులు కురిపిస్తున్న కన్నీరు

_ లికంఠి కన్నీరొలికన
ఇంటసిరి నిలువదన్నారు పెద్దలు
నేడు కలకంఠి కన్నీరే సిరులు
కురిపిస్తోంది.

కట్నాల కోసం లాంచనాల కోసం
భార్యల రాచారంపనాపెట్టడం
కన్నీరు మున్నీరుగా విలపిస్తు సతులు
పుట్టింట మళ్ళీ...మళ్ళీ డబ్బు తెచ్చి ఇవ్వడం
నిత్యకృత్యాలై పోయాయి.

వొంటిపై కిరోసిన్ పోసి నిప్పపెట్టి
సీలింగ్ ఫ్యాన్లకు ఊరిపోసి
ఆత్మహత్యలుగా చిత్రించి
కట్నాలకోసం మళ్ళీ పెళ్ళి చేసుకొనే
నిత్యపెళ్ళి కొడుకు లెందరో ? !

ఏ ఊరిచావిడిని అడిగినా
పడతుల కన్నీటి కథలే చెబుతాయి
ఏ వీధి స్తంభాన్ని తట్టినా
అబలల ఆర్తనాదపు నిట్టూర్పులే వినిపిస్తాయి

చెలగాటలాడే పిల్లి సరసన
ప్రాణ సంకటంతో బతికే ఎలుకల్లా
పాము పడగ నీడనున్న కప్పల్లా
నీతిలేని మగమృగాలు ఆలి కన్నీటి సముద్ర
ఆల్చిప్పల్లో ఆణిముత్యాల సిరులేరు కొంటున్నారు.
ఆమె కన్నీరే పన్నీరుగా శిరసున చిలికించుకొంటున్నారు.

సంగంబండ జగన్నాథరెడ్డి